బాబాయికి ఒంట్లో బాగాలేదని కబురు తెలిసింది.

పదిరోజులు సెలవు పడేసి, పద్మను పిల్లల్ని తీసుకుని ఊరికి బయల్దేరాను.

మా స్వగ్రామం దివిసీమలో కోడూరు. ఎంతెంత దూరదేశాలకైనా సులువుగా ప్రయాణం చేసి రావచ్చునుగాని, మా ఊరికి మాత్రం అంతతేలికగా వెళ్లిరాలేం. మాది చాలా చేవగడ్డే - ఆగడ్డమీద పచ్చగడ్డి కూడా అక్కరలేదు భగ్గుమనడానికి. మున్నూట అరవైదినాలూ రాజకీయాలు రగులుతూనే ఉంటాయి. అందుకనే అక్కడి ప్రజలకెవ్వరికీ అవనిగడ్డ - కోడూరు మధ్యగల రహదారి బాట విషయమే పట్టదు. రోడ్డుమీద గోతులుండటం సహజం. కాని ఆరోడ్డు మీద నూతులుండటం ప్రత్యేకత! నేను ఆ నూతులమీదుగా సాగే బస్సు ప్రయాణం చేసే సాహసం, ధైర్యం లేక విజయవాడ నుంచి నేరుగా టాక్సీ కుదుర్చుకున్నాను. టాక్సీవాడు తెగతిట్టుకున్నాడు రోడ్డునీ, మా ఊరునీ - నన్ను మాత్రం పైకి తిట్టలేదు, బాధపడతానని –

# ఉప్పెన

డా॥ వారువల్లి చక్రపాణిరావు

దీపావళి కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ





ప్రయాణం పొడుగునా మా'లల్లీ' నన్నూ 'బాబు'గాడేమో వాళ్లమ్మనూ ప్రశ్నలతో వేధిస్తూనే ఉన్నారు.

ఎందుకు వెడుతున్నాము, అంటే, చెప్పాను.

ఎన్నాళ్లుంటాం అక్కడ, అంటే, చెప్పాను.

ఎలా ఉంటుందా ఊరు, అంటే, చెప్పాను?

ఈ రోడ్డు ఇలా ఉందేమిటి, అంటే, ఏం చెప్పను?

'ఇక్కడి మనుమలకు బుద్ధిలేక' అన్నాను ఒళ్లు మండి.

నా అదృష్టం బాగుంది, వాళ్లకి బుద్ధెందుకు లేదు అని అడగలేదు తల్లీ.

మా ఆవిడనాకేసి గుర్రుగా చూసింది, ఎందుకు దాన్నలా కోప్పడతారని, లల్లీని దగ్గరకు తీసుకుంది.

'ఈ రోడ్డు ఎందుకు బాగా లేదంటే, ఇదివరకొకసారి ఇక్కడపెద్ద ఉప్పెన వచ్చింది. ఊరంతా కొట్టుకుపోయింది. రోడ్లన్నీ పాడయిపోయాయి, అందుకని!' అని

దాన్ని బుజ్జగించి చెప్పబోయింది.

బాబుగాడు తగులుకున్నాడు ఉప్పెనంటే ఏమిటని. 'ఉప్పెనంటే సముద్రం పొంగిరావడం. రాత్రికి రాత్రి పెద్ద పెద్ద కెరటాలతో సముద్రం పొంగివచ్చి ఊళ్లన్నింటినీ ఊడ్చేసుకు పోయింది' అని వివరించింది.

"ఊళ్లన్నీ ఊడ్చుకు పోయాయా? మరయితే మనమిప్పుడు ఎక్కడికి వెడుతున్నాం?" అన్నాడు బిక్కమొహంతో బాబుగాడు.

నాకు నవ్వాగలేదు.

"ఉప్పెన ఎప్పుడో 1977 లో వచ్చింది. సుమారుగా ఇరవయ్యేళ్లవుతోంది అదంతా జరిగి. ఊళ్లు పోయినా కొందరు జనం మిగిలారు. మళ్లీ ఆ ఊళ్లన్నీ బాగుపడిపోయాయి. చూస్తారుగా మీకే తెలుస్తుంది" అన్నాను.

'ఊళ్లన్నీ బాగుపడిపోతే ఈ రోడ్డెందుకు బాగువళ్లేదు?' అని మళ్లీ అడిగింది లల్లీ.

'ఇదీ బాగుపడిందే - రోడ్లు వేస్తూ ఉంటారు పోతూ ఉంటాయి. ఈ రోడ్డుని ఇప్పటికి చాలాసార్లే వేశారు. ఈమధ్య ఇక్కడ లారీలు, ట్రాక్టర్లు విపరీతంగా తిరుగుతూండటం వల్ల ఇంతగా పాడయ్యింది!' అన్నాను.

అప్పటికి సమాధానపడింది లల్లీ.

ఎలాగో ఇంటికి చేరుకున్నాం.

పిన్నీ బాబాయి మమ్మల్ని చూసి ఆనందించారు. అంతగా ప్రమాదమేమీ లేదుగానీ, పక్షపాతం వచ్చి పడిపోయాడు బాబాయి. ఎడమ చెయ్యీ, కాలూ కదలడం లేదు. ఏదో వైద్యం స్థానికంగానే చేయిస్తున్నారు. బెజవాడ వెళ్లిపోదాం బయల్దేరమన్నాను. అదే టాక్సీలో తిరిగి పోవచ్చునని నా ఉద్దేశ్యం. కుదరదన్నాడు బాబాయి. డబ్బిచ్చి టాక్సీ పంపేశాను.

రాయిలా ఉండే బాబాయి స్థాణువులా పడిఉంటే చూడలేకపోయాను. దుఃఖం పొర్లుకు వచ్చింది.

నాకు బాబాయే సర్వస్వమూను. దెబ్బయ్యేడు ఉప్పెనప్పుడు నేను బందర్లో ఉండి చదువుకొంటున్నాను. ఏదోపనిమీద పిన్ని బాబాయి వాళ్లపిల్లలిద్దర్నీ ఇంటిదగ్గర వదిలి బందరు వచ్చారు. వర్షాల వల్ల బస్సులు తిరగడం లేదని నాతోముకు వచ్చి ఉండిపోయారు. ఆ మునురు మునురు ఉప్పెనగా మారిపోయింది. రాత్రికి రాత్రి ఊళ్లను చుట్టబెట్టి కొంపలు కూల్చేసింది. బ్రతుకులు బద్దలు చేసింది. తాతలనాటి పాతపెంకుటిల్లు మాది పునాదులతో సహా కూలిపోయింది.

అంతే - తెల్లవారే సరికి నేను అనాథను - బాబాయి నిస్పంతూను! గుర్తు పట్టడానికి కూడా వీల్లేనంతగా శిథిలాలకింద శవాలు మిగిలాయి మేం వెళ్లేసరికి.

ఆదుఃఖాన్ని ఎలా దిగమింగామో, ఎలా నిలదొక్కుకున్నామో భగవంతుడికి తెలియాలి.

నాకు పిన్ని బాబాయి, వాళ్లకినేనూ సర్వస్వంగా మిగిలిపోయాం.

అప్పట్నుంచీ నాకు మా ఊరంటే చచ్చేటంత భయం. చదువు పేరు చెప్పి తప్పించుకు పారిపోయాను. ఆ తర్వాత ఉద్యోగం, పద్మతో పెళ్లి - బెజవాడ నాస్థిర నివాసమయిపోయింది. పద్మ మా పిన్నికి స్వయానా అన్న కూతురవ్వడంతో నాకు సమస్య లేకుండా పోయింది. పిన్ని బాబాయి వీలయినప్పుడల్లా వచ్చి మాతో నెలో రెండు నెలలో ఉండి తిరిగి వచ్చేస్తూంటారు. పొలాలమ్మేసి వచ్చెయ్యండంటే మాత్రం వినిపించుకోరు.

కోడూరులో మాకు పిత్రార్జితం అయిదెకరాలు. బాబాయి ఎలాగో దాన్ని పది చేశాడు. అపదెకరాలూ కాక హంసల దీవిలో మా అమ్మ పసుపు కుంకుమలకని



## లేని దేవుడి దయ

విలేఖరి అడిగాడు ఓ నిర్మాతను - "మీరు తీసిన 'దేవుడు లేడు' సినిమా హిట్టవుతుం దంటారా?"

"ఏమో, ఆ దేవుడి దయ!" చెప్పారు ఆ నిర్మాత.

ఏ. రమణకుమార్ [వైజాగ్]

తెచ్చుకున్న పొలం మరొక అయిదెకరాలుంది. ఈ మొత్తం బాబాయే సొంతంగా సాగు చేస్తున్నాడు.

బాబాయికి నేనంటే ప్రాణం. చాలా మురిపెంగా నన్ను పెంచుతూవచ్చాడు. నాన్న అమ్మలేనిలోటు ఎంత మాత్రమూ రానీయలేదు నాకు. పిన్నికి సరేసరి, పద్మ వచ్చేంతవరకూ నన్ను వదిలి ఉండేది కాదు. నేను విశాఖలో ఎం.ఏ. చదివిన రెండేళ్లూ నా దగ్గరే ఉండిపోయింది.

తలుచుకున్నప్పుడల్లా నాకెంతో చిత్రమనిపిస్తూంటుంది. ఆ మాయదారి ఉప్పెన మా బంధాలనెలా తారుమారు చేసిందో! బాబాయి కొడుకులిద్దరూ అమ్మానాన్నలతో వెళ్లిపోయారు పైలోకాలకి; నేనేమో పిన్ని బాబాయిలతో ఉండిపోయాను ఈ లోకంలో!

బాబాయి అంటూండేవాడు -

'ఒక్క రహస్యం ఉందిరా ప్రకృతిలో - తల్లి ఉందనుకో బిడ్డడు తెలిసో తెలియకో ఏదన్నా తప్పు చేస్తే దండిస్తుంది, మొహమాటపడదు - ఆ తర్వాత వాడు బాధపడుతూంటే మాత్రం చూడలేదు, వెంటనే దగ్గరకు తీసుకుని లాలిస్తుంది. వెనుకటికంటె ప్రేమగా చూస్తుంది. ప్రకృతీ అంతే - తల్లిలాగానే దండించింది ఉప్పెనతో - ఆ తర్వాత అంతులేని అనుగ్రహంతో లాలిస్తోందిప్పుడు - 'చూశావా, ఈ ప్రాంతమంతాను. ఎలా తిరగబడిందో!'

నిజమే బాబాయి చెప్పింది.

ఆత్మీయత విషయంలో మాలోటు నిలా పూడ్చింది.

సంపద విషయంలో సిరులు కురిపించేస్తోందిక్కడ!

చవుడేసిపోయి ఎందుకూ పనికి రావనుకున్న పొలాలన్నీ ఇప్పుడు బంగారం పండుతున్నాయి. పూర్వం పదిపదిహేను బస్తాలు కూడా పండని భూములిప్పుడు నలభై బస్తాలు దిగుబడినిస్తున్నాయి. ఎకరం భూమి ఇప్పుడిక్కడ లక్ష రూపాయలు. మొదట్లో తెలియక రైతులు పొలాలు పనికిరావనుకుని అయినకాడికి అయిదువేలకో పదివేలకో అమ్మేసుకుని నష్టపోయారు.

ఇప్పుడు మళ్లీ కొందామన్నా కొనలేక బాధపడుతున్నారు.

పిన్ని కాఫీ పట్టుకు వచ్చింది.

పద్మ పిల్లలకి పాలు తాగిస్తోంది.

"కామశాస్త్రి గారబ్బాయి ప్రసాదు లేడూ, వాడు నువ్వొస్తే కబురు చెయ్యమన్నాడు. మనిషిని పంపించాను, వస్తాడు ఇంకాసేపట్లో" అంది పిన్ని.

"వాడెప్పుడొచ్చాడు?" అన్నాను.

"ఇక్కడే ఉంటున్నాడుగా ఉద్యోగం వదిలేసి - చెరువుల వ్యాపారం చేస్తున్నాడు. వాడి పనిప్పుడు చాలాబాగుంది. ఈ మధ్య మారుతీకారు కూడా కొన్నాడు" అంది పిన్ని.

"వాడు చంపుకు తింటున్నాడురా. హంసలదీవిలో అయిదెకరాలూ ఇచ్చెయ్యమంటాడు లీజుకి. చెరువులు తవ్వించుకుంటాడుట - ఉ నువ్వే ఏదో చెప్పుకోవాడికి" అన్నాడు బాబాయి.

ఆ కబుర్లూ ఈ కబుర్లతో పావుగంట గడిచేసరికి ప్రసాదు దిగబడ్డాడు.

"నిక్షేపంలా బందరు కాలేజీలో పాఠాలు చెప్పుకోక నీకిదేం పోయేకాలంరా" అన్నాను వాడిని చూస్తూనే.

"అది నిక్షేపమని నువ్వనుకుంటున్నావ్. ఇదే నిక్షేపమని వాడనుకొంటున్నాడు - అంతేనట్రా ప్రసాదూ?" అంది పిన్ని.

"ఉన్నమాట చెప్పావు పిన్నీ! రెంటికీ ఎలాకుదురుతుంది చెప్పు? దగ్గరుండి చూసుకోకపోతే ఇవి పోతాయి. పిల్లలకి పాఠాలు సరిగ్గా చెప్పకపోతే అక్కడ ప్రిన్సిపాలుతో గొడవ - లీవ్ ఇమ్మంటే ఇవ్వనన్నారు. అందుకే రిజైన్ చేసి పారేశాను - ఎందుకు వెధవ గొడవవాళ్లతో" అన్నాడు ప్రసాదు నా ప్రక్కనున్న కుర్చీలో కూర్చుంటూ.

వాళ్ల ప్రిన్సిపాలుతో పేచీలు, మేనేజిమెంటుతో గొడపలు అన్నీ చెప్పుకువచ్చాడు. వింటూ ఉండిపోయాను.

రాకెట్‌లా బాబుగాడు దూసుకువచ్చాడు. అప్పుడే ఎప్పుడు పోగేశాడో గాని వాడి ఫ్రెండ్సందరూ బయటే నిలబడిపోయారు.

"డాడీ, డాడీ! డబ్బాల్లో పట్టి మంచినీళ్లమ్ముతున్నారిక్కడ, మీకు తెలుసా?" అన్నాడు.

నోరు వెళ్లబెట్టాను.

"నిజం డాడీ! పెద్దపెద్ద తెల్లని ప్లాస్టిక్కు టిన్నులలో పట్టి నీళ్లన్నీ లారీల్లో ఎగుమతి కూడా చేస్తున్నారు - వాళ్ల నడుగుకావాలంటే .." అంటూ ఫ్రెండ్స్‌కేసి చూపించాడు.

నే పుట్టిన ఊళ్లో నాకు తెలియని వింత ఒకటి మా అబ్బాయి పట్టేసినందుకు ఆశ్చర్యపోయాను. నాకు తెలియని విషయాన్ని వాడికేం వివరించగలను? అందుకే, "ఈ అంకుల్ నడుగు చెబుతాడు అదేమిటో" అన్నాను ప్రసాద్‌ని చూపిస్తూ.

"అవును- అవి మంచినీళ్లే- ఈ చుట్టుపట్ల సముద్రానికి దగ్గర్లో కొన్ని ఊళ్లున్నాయ్. అక్కడ రొయ్యలు పెంచడానికి పెద్ద పెద్ద చెరువులు తవ్వుతున్నారు. ఆ త్రవ్వే పనిలో కొన్ని వందల మంది కూలీలు పని చేస్తూ ఉంటారు. వాళ్లకి అక్కడ మంచినీళ్లు దొరకవు. అందుకని ఇక్కడ నుంచి పట్టుకువెళ్లి అక్కడ వాళ్లకి, డబ్బా పాతికకో ముప్ఫయికో అమ్ముతుంటారు ఈ నీళ్ళన్నీ" అంటూ వివరించాడు ప్రసాదు.

"మరైతే, మన పక్క పోర్షన్ ఆంటీ వాళ్లు హైదరాబాద్ నుంచి వచ్చారు గదా, వాళ్ళకక్కడ నీళ్ళే ఉండేవి కావని చెప్పిందికదా, అక్కడ కూడా ఇలా టిన్స్‌తో పట్టి వాటర్ ఎంత కావలసివస్తే అంత ఎందుకమ్మరు?" అని మరో ప్రశ్న సంధించాడు మావాడు.

"నిజమేరోయ్, బ్రహ్మాండమైన అయిడియా ఇచ్చావ్ నువ్వు - మనమే ఆ వ్యాపారం కూడా మొదలు పెడదాం ఉండు" అన్నాడు నవ్వుతూ ప్రసాద్.

"నాకు కాన్వెంటూ, మా నాన్నకి ఆఫీసూ ఉన్నాయిగా, అందుకని కుదరదు- కావలస్తే మీరు పెట్టుకోండి నీళ్ళ వ్యాపారం" అనేసి వెళ్లిపోయాడు బాబుగాడక్కడ నుంచి.

"అసాధ్యుడురా, మీవాడు", ఏమనలేక అభినందించి ఊరుకున్నాడు. చెరువులు ఎలా తవ్వుతారో, మోటారుతో నీళ్లు తోడి ఎలా పెడతారో, రొయ్య సీడ్స్ ఎలా సంపాదించాలో, వాటిని ఎలా జాగ్రత్తగా పెంచాలో, దిగుబడి ఎలా ఉంటుందో ఎంతెంత లాభాలు వస్తాయో చాలాసేపు వివరించి, చివరికి అసలు విషయానికి వచ్చాడు ప్రసాదు.

"ఇప్పుడిక్కడ వరిసాగు బాగా తగ్గిపోయిందిరా. అగ్రికల్చర్‌కు బదులు ఆక్వాకల్చర్ వృద్ధిలోకి వస్తోంది. పాలకాయతిప్ప, వాసాలతిప్పమొదలైన పల్లెల్లోని మత్స్యకారులందరూ తెగ బాగుపడిపోయారు. రొయ్యలకి విదేశీ గిరాకీ చాలా ఎక్కువగా ఉంది తెలుసా? ఒక లక్ష రూపాయలు మనవి కావనుకుని రెండు చెరువులు తవ్వించుకున్నామనుకో, అయిదేళ్ళపాటు మరింక చూసుకోనక్కరలేదు- డబ్బే డబ్బు! వెధవ ఉద్యోగం వెలగబెట్టి ఏం సంపాదించగలంరా? నా మట్టుకు నేను ఇప్పటికే ఆరెకరాలు చెరువులు చేశాను. బ్రహ్మాండంగా గిట్టుబాటవుతోంది.

రేపో సారి అలా హంసలదీవికేసి వెళ్లివద్దాం- మీ పొలం చుట్టూ అన్నీ చెరువులే-ముందు ముందు మీరు వరి వేద్దామన్నా వీలు పడదు. ఇప్పటికే దిగుబడి పడిపోయింది ఆ పొలాల్లో. చుట్టూ ఉప్పునీరుగదా, చవుడేసిపోతాయి భూములన్నీను. అందుకని నీకు ఇంటరెస్టు ఉంటే సొంతంగా చెరువులు తవ్వించుకో దగ్గరుండి నేను చూసిపెడతాను అన్నీ -లేదా, నాబోటి వాడికి ఒక అయిదేళ్ళకి లీజుకిచ్చెయ్- తక్షణం ఒక లక్ష రూపాయలు వచ్చి నీ చేతుల్లో పడిపోతాయి. ఆ తర్వాత సాలు కింతని అనుకొందాం. అది మీ అమ్మగారి పొలమని నీకు సెంటిమెంట్ ఉండొచ్చు-భూమి ఎక్కడికీ పోదు. నీకిందే ఉంటుంది. జస్ట్ ఫర్ రిలీజ్ ఫర్ ఎ పీరియడ్ అఫ్ ఫైవియర్స్- ఆలోచించుకో దాన్నలా ఉత్తినే వదిలేస్తే పనికి రాకుండా పోతుంది, తర్వాత నీ యిష్టం" అన్నాడు.

"అయిదేళ్ల తర్వాత ఈ భూముల గతేమిటి?" అన్నాను వాడి కళల్లోకి చూస్తూ.

"కావాలంటే లీజ్ మరో అయిదేళ్లకి పెంచుకోవచ్చు. లేదా సొంతంగానే చేసుకోవచ్చు. రొయ్యలకు డిమాండ్ ఉన్నంతవరకూ చెరువులకు నష్టం రాదు-దటీజ్ 'ష్యూర్" అన్నాడు.

"లీజ్ మాట కాదు నేనడిగింది-చెరువుల తర్వాత భూములేమవుతాయని? అన్నాను.

"మేక్ హేవెన్ ది సన్ షైన్స్ అన్నారు- అయిదేళ్ల తర్వాత ఎవరం ఎలా ఉంటా ఎక్కడుంటామో. మో- ఈ భూముల్ని పట్టుకునే కూర్చుంటామేమిటి? నీదంతా ఛాదస్తం" అన్నాడు తేలికగా కొట్టిపారేస్తూ.

నాకు తెలును మరింక ఆ భూములు ఎందుకూ పనికి రావని. ఆ మాట వాడు చస్తే వాడి నోటితో చెప్పడు. 'ఆలోచించి చెబుతానులే ఏ సంగతీను' అన్నాను.

వాడు వెళ్లిపోయాడు.

"చెరువులు తవ్వించినా తవ్వించకపోయినా భూములెలాగూ చవుడేసి పనికి రాకుండా పోతాయి. అలాంటప్పుడు వచ్చే నాలుగు డబ్బులూ వదులుకోవడం వెర్రితనమే అవుతుందేమో! మన మొక్కళ్లం మడి గట్టుకు కూర్చుకున్నందువల్ల ఒరిగేదేం ఉండదు- నలుగురుతోపాటు నారాయణా" అన్నాడు బాబాయి.

"మనకిప్పుడేం లోటు వచ్చిందని? ఆ అడ్డదారి సంపాదన మనకి వద్దు- ప్రసాదు చెప్పినట్టు నాకు సెంటిమెంటే అను, మరొకటను -తల్లిలా తింది పెడుతున్న భూమాతను కయ్యిగా మార్చడం నాకిష్టం లేదు. ఎంతవస్తే అంతే వస్తుంది. దాన్నలా ఊడుపు చేనుగానే ఉంచేద్దాం బాబాయ్" అన్నాను-

"సరే, అలాగేలే" అన్నాడు బాబాయి.

అక్కడితో ఆ కథ ముగిసింది.

బాబాయికి నచ్చచెప్పి, వైద్యం కోసమని మాతో బెజవాడ తెచ్చుకున్నాం. మూడు నెలల్లో బాగా కోలుకుని తిరిగి కోడూరు వెళ్ళిపోయారు పిన్నీ బాబాయి.

సుమారు ఒక సంవత్సర కాలం దొర్లిపోయింది సాదసీదాగా.

ఒకనాటి సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చేసరికి బాబాయి వచ్చి ఉన్నాడు. పలకరింపులు అయ్యాక,

"మీ ప్రసాదుకు చాలా సీరియస్‌గా ఉందిట. ఇక్కడ ఏదో పెద్ద 'పోలీక్లినిక్' ఉందటగా - దానిలో చేర్పించారు. చూసిపోదామని వచ్చా" అన్నాడు.

స్థాణువునయ్యాను.

"దేనికంత ఆశ్చర్యపోతావు? వాడి నడిమంత్రపుసిరి వాడిని ముంచేసింది. హైదరాబాద్‌లో ద్రాక్ష తోటలన్నాడు, బెంగుళూరులో కాఫీ తోటలన్నాడు, అక్కడెక్కడో దిక్కుమాలిన భూములు కొని రియల్ ఎస్టేట్ బిజినెస్ అన్నాడు. ఈ మధ్య మద్రాసులో సినిమా తీయిస్తున్నానన్నాడు. చివరికి చేతికి చిప్ప, నెత్తికి చెంగూ మిగిలాయి. సిరి మిగల్లేదు గాని చెడు మిగిలిందన్నట్టుగా అర్థమైన రోగాలూ తెచ్చుకున్నాడు. తాగుడువల్లనో ఏమో లివరూ, కిడ్నీలూ పాడయ్యాయన్నారట. అక్కడ చూపించి, ఇక్కడ చూపించి, చివరికీ ఊళ్ళో చేర్పించారు. భార్యాపిల్లలూ గోల గోల 'పరధర్మానికి పోవద్దురా అంటే మావాడు వినలేదు, మాయదారి చెరువులు మావాడిని పొట్టన బెట్టుకున్నాయి' అంటూ ఆ కామశాస్త్రిగారు ఒకటే ఏడుపు. పద, ఒకసారి చూసివద్దాం, ఎలా ఉన్నాడో" అన్నాడు బాబాయి.

కాఫీ తాగి, ఆటోలో బయల్దేరాం.

చాలా దయనీయంగా ఉంది ప్రసాదు పరిస్థితి. నన్ను గుర్తుపట్టి కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు.

"డోన్ట్ వర్రీ - గాడ్ ఈజ్ గ్రేట్" అన్నాను.




## దివాలా తీశావా?

సోమనాథం : హొటల్ పెట్టి దివాలా తీశావా? అదేమిటయ్యా?

రంగనాథం : ఇక్కడ పదార్థాలు మీ ఇంట్లో తయారుచేసిన పదార్థాలవలె ఉంటాయి అది బోర్డు పెట్టాను. అంతే! ఒక్కరూ రాలేదు.

పి. శ్రీనివాసులురెడ్డి [పెదకాకాని]

నిన్న గ్రహాగా ఒక చిన్ననవ్వు నవ్వాడు. మాట్లాడకూడదన్నారట - డెబ్భయ్ రెండు గంటలు పోయాక గాని ఏ సంగతీ చెప్పలేమన్నారట. కిడ్నీ మార్చవలసి రావచ్చు. ఎక్కడన్నా చూసి ఉంచుకోండని చెప్పారుట. వాళ్ళావిడా పిల్లలలూ దిక్కులేని పక్షుల్లా విలవిల్లాడిపోతున్నారు.

ప్రసాదు, నేనూ కె.జి. నుంచి పి.జి. వరకు సహాధ్యాయులం. చాలా ఆత్మీయులం. చిన్నప్పుడు వాళ్ళ కుటుంబం దరిద్రంతో బాధపడేది. స్కాలర్‌షిప్పులతోను, నావంటి మిత్రుల సహకారంతోను ఎలాగో వాడు ఎం.ఏ. పాసై లెక్చరరు అయ్యాడు. ప్రయివేట్లు చెప్పి బాగానే సంపాదించేవాడు. దరిద్రంపట్ల అసహ్యంతోనో ఏమో, 'కోటీశ్వరుడినై పోవాలిరా, ఐ మస్ట్ బి ఏ మిల్లియనీర్. దటీజ్ మై యాంబిషన్ ఇన్ లైఫ్' అంటూండేవాడు. చెరువులవల్ల బాగుపడుతున్నాడంటే సంతోషించాను. కానీ, ఇదేమిటిప్పుడిలా...? మనస్సు కలతపడింది.

కాస్సేపు కూర్చుని, అందరికీ ధైర్యం చెప్పి ఇంటికి తిరిగి వచ్చాం.

ఉదయం ఆరింటికి ఆస్పత్రి నుంచి ఫోను - ప్రసాదు పోయాడు - ఇంటికి తీసుకుపోదాం, ఏదైనా టాక్సీ మాట్లాడి తీసుకురమ్మని. నిన్న సాయంత్రం వాడిని చూసినప్పుడే అనిపించింది 'వీడి పని అయిపోయింది, మరింక బ్రతకడని.' రాత్రంతా వాడి గురించే బాధపడ్డాను. అందువల్ల మరింక నాకు దుఃఖం కలుగలేదు.

టాక్సీ స్టాండుకు ఫోను చేసి, ఆస్పత్రికి రమ్మని, నేనూ, బాబాయి ఆటోలో బయల్దేరాం. అప్పటికే అక్కడ శవంతో అందరూ సిద్ధంగా ఉన్నారు.

ఏ గతుకుల రోడ్డుమీద మారుతీ కారులో ఊరేగాడో, అదే గతకుల రోడ్డుమీద కిరాయి కారులో ప్రసాదు, ప్రాణాలు లేకుండా! చాలా ఆశ్చర్యమనిపించింది!

కోడూరు ఊళ్ళోకి ప్రవేశిస్తుంటే కంపు, ఏదో రోత-బాబాయి చెప్పాడు - రాత్రిపూట రొయ్య తలలు లారీల్లోంచి వీధుల్లో పోసేస్తున్నారట, అదీ కంపు. ఈ రొయ్య విత్తనం అని చెప్పి పీచుగడ్డి, ఎక్కువ ధరకు అంటగడుతున్నారట. ఒక విధమైన తెగులు వచ్చి రొయ్యలు చచ్చిపోతున్నాయట - చెరువుల వాళ్ళకందరికి లాభం గుబల్లోకి వచ్చేసినట్లే - అయిపోయింది ఆ భోగం అన్నాడు.

ఎదురుగా షాపుల్లో రంగు రంగుల సీసాలు వేలాడుతూ కనిపించాయి. "అవా? మంచినీళ్ళులే - పెద్ద సీసా పదీ, చిన్న సీసా అయిదూ" అన్నాడు బాబాయి.

"మినరల్ వాటరా?" అన్నాను.

"కాదు, మామూలు నీళ్ళే - తాగే నీరు - ఏ నీరు పడితే ఆ నీరు త్రాగితే రోగాలొస్తున్నాయి. ఇదేదో శుభ్రమైన కృష్ణా జల అంట! ఇక్కడ కూడా నూతులన్నీ పాడయిపోయాయిలే" అన్నాడు బాబాయి.

అప్పుడు సముద్రం పొంగి వచ్చి మనుమల్ని మింగేసింది. ఇప్పుడు మనుమలే సముద్రాన్ని మీద మీదకి తెచ్చుకుంటున్నారు. అది దేవుడు తెచ్చిన ఉప్పెన - ఇది మనుమలు తెచ్చుకున్న ఉప్పెన. నెమ్మది నెమ్మదిగా చాపకింద నీరులా రూపాయల కెరటాలు మనుమల్ని ముంచెత్తుతోంటే, మత్తులో పడి ప్రసాదు లాంటి ఎందరు కొట్టుకుపోతున్నారో! బాబాయి చెప్పినట్టు ఆ ఉప్పెన తను కలిగించిన నష్టాన్ని తానే భర్తీ చేసింది. ఈ నష్టాన్ని ఏ దేవుడు పూడ్చగలడు? ★